సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం | 31 | అక్టోబర్ | 2024



చీకట్లు పోవాలె.. వెలుగులు నిండాలె

నేడు దీపావళి

- ఇంటింటా సందడి
- రంగురంగుల పటాకులు.. ప్రమిదలు
- కిక్కిరిసిన మార్కెట్
- జాగ్రత్తలు తప్పనిసరంటున్న నిపుణులు

ప్రకృతి.. మనుషులది విడదీయరాని అనుబంధం.. మనం ఏం చేసినా పర్యావరణ హితంగా ఉండాలి. వెలుగుల పండగ దీపావళిని ప్రకృతి హితంగా జరుపుకుందాం. విషపూరిత రసాయనాలతో తయారైన బాణసంచా కాల్చితే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. భారీ శబ్దం కలిగించే వాటితోనూ ప్రమాదం పొంచి ఉంది. ఇంటిల్లిపాదీ పర్యావరణ హిత టపాసులను కాల్చి మరింత అందంగా దీపావళిని జరుపుకుందాం. నేటి వెలుగుల వేడుకకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు.

– సిరిసిల్లకల్చరల్/కరీంనగర్ కల్చరల్/కరీంనగర్ క్రైం/విద్యానగర్/కోల్‌సిటీ

నేటి దీపావళి సందర్భంగా మార్కెట్లో సందడి నెలకొంది. కరీంనగర్ సిటీతో పాటు గోదావరిఖని, పెద్దపల్లి, సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి తదితర పట్టణాలతో పాటు గ్రామాల్లో బంతిపూలు, ప్రమిదలు, ఇతర పూజా సామగ్రిని పెద్ద ఎత్తున విక్రయించారు. పెద్దసంఖ్యలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయగా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

పర్యావరణహితం ప్రధానం

దీపావళి రోజు పేల్చే బాణాసంచాతో పర్యావరణానికి పెద్ద ముప్పు వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క టపాసు పేలితే వచ్చే పొగ అయిదువందల సిగరెట్లకు సమానం అన్నది పుణె పరిశోధకుల మాట. దీపావళి



వేడుకలపై గతంలో సుప్రీంకోర్టు ఆంక్షలు విధించింది. రాత్రి ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకు తక్కువ కాలుష్యం వచ్చే గ్రీన్‌క్రాకర్స్ వాడాలని సూచించింది. మార్కెట్లో గ్రీన్ క్రాకర్స్ విక్రయిస్తున్నప్పటికీ, చాలా మంది కాలుష్యం వెదజల్లే బాణాసంచాలనే కాల్చుతున్నారు.

బాణాసంచాతో అనారోగ్య సమస్యలు

బాణాసంచాతో వ్యాపించే రసాయనం వల్ల శ్వాస వ్యవస్థ దెబ్బతింటుంది. మెగ్నీషియం, జింకు, నైట్రేట్, గంధం వంటి పదార్థాలతో తయారైన బాణసంచా పొగపీల్చితే ఆస్తమా, ఇతరత్రా శ్వాసకోశ, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు ఆస్కారం ఉంటుంది. శబ్ద తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల కర్ణభేరి దెబ్బతింటుంది. పొగ కళ్లల్లోకి వెళ్తే కంటి పొరలు దెబ్బతిని చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. తక్కువ శబ్దం వచ్చే బాణసంచా కాల్చడం అన్ని విధాలా శ్రేయస్కరం.



సిరిసిల్ల మార్కెట్లో ప్రతిమలు కొంటున్న ప్రజలు



సిరిసిల్లలోని బాణాసంచా దుకాణాలు

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- పెట్రోల్ బంకులు, గుడిసెలు, గడ్డివాములకు దూరంగా పటాకులు కాల్చాలి. రాకెట్లు వంటి వాటిని విద్యుత్ తీగలు, చెట్ల కింద కాల్చొద్దు. ఇంట్లో బాణసంచాను గ్యాస్‌స్టవ్, ఇతరత్రా పొయ్యిల పక్కన ఉంచొద్దు.
- చిన్న పిల్లలు, వృద్ధులు గర్భిణులు నివసించే చోట భారీ శబ్దం చేసే పటాకులు కాల్చొద్దు. కాకరవత్తులు, విష్ణుచక్రాలు కాల్చిన తర్వాత వాటి ఇనుప తీగలు ఎక్కడ పడితే అక్కడ పడేయొద్దు.
- టపాసులు కాల్చే ప్రాంతంలో ప్రాథమిక చికిత్సకు సంబంధించిన కిట్‌ను దగ్గర ఉంచుకోవాలి. కాటన్ దుస్తులు, కళ్లద్దాలు ధరించం మంచిది. కంట్లో ఏదైనా పడినట్లుగా అనిపిస్తే పారేనీటిలో 10నిమిషాల పాటు కంటిని శుభ్రం చేయాలి. ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.
- అనుకోని సంఘటన ఏదైనా జరిగితే డయల్ 100కి డయల్ చేసి పోలీసుల సాయం తీసుకోవాలి. అవసరమైతే 108కి ఫోన్ చేయాలి. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగితే అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉన్నాయి.

ఫైర్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు

కరీంనగర్	8712699240
హుజూరాబాద్	8712699242
జమ్మికుంట	8712699244
చొప్పదండి	8712699246
మానకొండూర్	8712699248
పెద్దపల్లి	8712699202
మంథని	8712699204
గోదావరిఖని	8712699206
జగిత్యాల	8712699234
మెట్‌పల్లి	8712699236
ధర్మపురి	8712699238
సిరిసిల్ల	8712699258
వేములవాడ	8712699260

నోములు శుక్రవారం



అమావాస్య రాత్రి గురువారమే ఉండడంతో దీపావళి, లక్ష్మీపూజలు ఈ రోజే జరుపుకోవాలి. 1వ తేదీ శుక్రవారం అమావాస్యతో కూడిన స్వాతీ నక్షత్రం ఉన్నందున కేదారేశ్వర వ్రతాలు, పడిపోయిన నోములు, పాత నోములు, కొత్త నోములు నోముకోవచ్చు.

– నమిలకొండ రమణాచార్యులు, కరీంనగర్

కంటి రక్షణ ప్రధానం



బాణాసంచా కాల్చేప్పుడు కంటిలో ఏవైనా మెరుపులు పడితే నలపడం చేయకూడదు. సౌండ్ పొల్యూషన్ లేకుండా వెలుతురు ఇచ్చే క్రాకర్లు ఉపయోగించాలి. కళ్ల రక్షణకు గాగుల్స్ వాడాలి. పరిస్థితి తీవ్రతను బట్టి నిపుణుడైన కంటివైద్యున్ని సంప్రదించాలి.– కత్తి మురళీకృష్ణ, కంటి వైద్య నిపుణుడు

నిబంధనలు తప్పనిసరి

బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు సంబంధితశాఖల అనుమతి తప్పనిసరి. దుకాణాలు జనావాసాల్లో ఏర్పాటు చేయొద్దు. టపాసులు విక్రయించే ప్రాంతంలో బకెట్లలో ఇసుక, డ్రమ్ముల నిండుగా నీళ్లు అందుబాటులో ఉంచుకోవాలి. చట్టబద్ధంగా ఆమోదించిన, నాణ్యమైన బాణసంచా విక్రయించాలి. పండుగ ముగిశాక మిగిలిన బాణాసంచాను అగ్నిమాపకశాఖ అధికారులు ఎంపిక చేసిన గోదాముల్లో వ్యాపారులు భద్రపరచాలి. నిబంధనలకు విరుద్ధంగా నచ్చినచోట నిల్వ చేయటంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది.

చర్మ రక్షణ కోసం



పండుగ పూట వీలైనంత వరకు సిల్క్, నైలాన్ దుస్తులు వేసుకోకూడదు. అనుకోకుండా ప్రమాదం జరిగి చర్మం కాలితే ధారగా పడుతున్న నల్లా నీటికింద గాయపడిన ప్రాంతాన్ని శుభ్రం చేసుకోవాలి. కాటన్‌తో కవర్ చేసి మంచి చర్మ వ్యాధి నిపుణుడిని సంప్రదించాలి.

– వై.వెంకటేశ్, చర్మ వ్యాధుల నిపుణుడు

అప్రమత్తంగా ఉండాలి



దీపావళి సందర్భంగా ప్రజలు బాణాసంచా కాల్చే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. సిలిండర్లు, అగ్గిపెట్టెలు, ఇతర పదార్థాలకు దూరంగా కాల్చాలి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే ఫైరింజిన్లకు ఫోన్ చేయాలి. సిబ్బందితో సిద్ధంగా ఉంటాము. – శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ ఫైర్ ఆఫీసర్

న్యూస్‌రీల్

రేపు కరీంనగర్‌కు బీసీ కమిషన్ రాక



సిరిసిల్ల: స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల దామాషాను వివరించే ఆసక్తి గల రాజకీయపార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 1న కరీంనగర్‌కు వస్తుందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బుధవారం తెలిపారు. జిల్లాకు చెందిన వారు కరీంనగర్ వెళ్లి తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుందని తెలిపారు. అభిప్రాయాలు, సలహాలు, సూచనలను నిర్దేశిత నమూనాలో ఆరు సెట్లను అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.

వెట‘రన్’ రామానుజమ్మకు పసిడి పతకాలు



సిరిసిల్లటౌన్: జాతీయస్థాయి వెటరన్ పరుగు పందెంలో సిరిసిల్లకు చెందిన రామానుజమ్మ రెండు బంగారు పతకాలు గెలుచుకుంది. ఈనెల 23 నుంచి 27 వరకు నాసిక్‌లో మూడో జాతీయ వెటరన్స్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలను వెటరన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా తరఫున పాల్గొన్న రామానుజమ్మ 1500 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందేలలో రెండు బంగారు పతకాలు సాధించారు.

అందరికీ సమాన హక్కులు ఉండాలి



ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రజలందరికీ సమానహక్కులు ఉండాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు పసుల బాలరాజు పేర్కొన్నారు. కులమతాలకు తావులేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో బుధవారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, సెక్రటరీ తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీచౌక్‌లో ఫ్లెక్సీ తొలగింపు



సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి అడ్డంగా ఓ టపాసుల వ్యాపారి ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనిపై ‘మహాత్మా మన్నించు..’ శీర్షికన బుధవారం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆ ఫ్లెక్సీని తొలగించి, దాన్ని ఏర్పాటు చేసిన వ్యాపారికి జరిమానా విధించాలని ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య మహాత్మా గాంధీవిగ్రహానికి అడ్డంగా ఉన్న ఫ్లెక్సీని మున్సిపల్ సిబ్బందితో బుధవారం తొలగింపజేశారు. ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన వ్యాపారికి రూ.5వేల జరిమానా విధించారు. ‘సాక్షి’ కథనంతో జాతిపిత విగ్రహానికి అడ్డుగా ఉన్న ఫ్లెక్సీ తొలగిపోయింది.

ఆరోగ్యలక్ష్మీ అమలు చేయాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆరోగ్యలక్ష్మీ పథకాన్ని అంగన్‌వాడీలు బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో బుధవారం నిర్వహించిన సెక్టార్ సమావేశంలో మాట్లాడారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం మాట్లాడుతూ కాంట్రాక్టర్లు సరఫరా చేసే గుడ్లు, పాలు, కందిపప్పు, నూనె ఎలా ఉన్నాయో తనిఖీ చేసిన తర్వాతే తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నాణ్యమైన పోషకాహారాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేసిందన్నారు. సూపర్‌వైజర్ అంజలి, టీచర్లు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడఅర్బన్: రాజన్న భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది పనితీరు బాగుందన్నారు. పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. రికార్డ్, రైటర్ గదులను పరిశీలించారు. రౌడీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెంచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. గంజాయి కిట్లతో అనుమానితులకు పరీక్షలు చేయాలన్నారు. గంజాయి సరఫరా, వినియోగం గురించే తెలిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, ఎస్సై రమేశ్, రాజు, సిబ్బంది ఉన్నారు.

ముస్తాబాద్ ఠాణా తనిఖీ

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఠాణాలో నమోదైన కేసుల వివరాలు పరిశీలించారు. చోరీ ఘటనల్లో ఎంత మేరకు రికవరీ అయ్యాయి, పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్సై గణేశ్ ఉన్నారు.



వేములవాడ ఠాణాలో ఎస్పీ అఖిల్ మహాజన్

వృద్ధులకు ‘ఆయుష్మాన్‌భవ’!

- ఏబీ–పీఎంజేఏవైతో 70 ఏళ్లు పైబడిన వారికి ప్రయోజనం
- ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మందికిపైగా వృద్ధులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్:


కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్లు పైబడిన వారికి పేద, ధనిక అనే తేడాలేకుండా వైద్యం కోసం ప్రత్యేక బీమా కల్పిస్తోంది. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ–పీఎంజెవై) కింద ఈనెల 30 నుంచి ఆరోగ్య బీమా అవకాశం కల్పిస్తోంది. అర్హులైన సీనియర్ సిటిజన్లకు ఈ పథకం కింద కొత్త, విభిన్నమైన కార్డ్ జారీచేయబడుతుంది. ఆధార్ కార్డు ప్రకారం 70 ఏళ్లు లేదా అంతకన్నా ఎక్కువ వయస్సు ఉన్న ఎవరైనా... ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని కేంద్రం తెలిపింది. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో 70 ఏళ్ల పైబడిన వారు ఓటరు లిస్టు ప్రకారం సుమారు రెండు లక్షల మందికి పైగా లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటికే నిరుపేద కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత వైద్యం అందించేందుకు బీమా పథకాలు అమలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షల వరకు, రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల వరకు ఒక్కోకుటుంబానికి వైద్యానికి ఖర్చు చేస్తున్నాయి.

దరఖాస్తు చేసే విధానం...

ఏబీపీఎంజేఏవై పథకంలో లబ్ధి పొందేందుకు పీఎంజేఏవై పోర్టల్ లేదా ఆయుష్మాన్ యాప్ లో దరఖాస్తు చేసుకోవచ్చు. పీఎంజేఏవై పోర్టల్ పీఎంజేఏవైజీవోవీ.ఇన్ లాగిన్ అయి 70 ప్లస్ ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. దాంతో బెనెఫిషియరీ.ఎన్‌హెచ్ఏ.జీఓవీ.ఇన్ అనే వెబ్ సైట్‌కి రీడైరెక్ట్ అవుతారు. అక్కడ క్యాప్చా, మొబైల్ నెంబర్, ఓటీపీ ఎంటర్ చేయాలి. తర్వాత కేవైసీ కోసం వివరాలు నమోదు చేసి ఆమోదం కోసం చూడాలి. ఆయుష్మాన్ కార్డు సిద్ధమైన తర్వాత అధికారిక ఆమోదం లభించిన వెంటనే బీమా కార్డు డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ఇవీ ఉపయోగాలు..

- అర్హులైన సీనియర్ సిటిజన్లందరికీ ఈ పథకం కింద ఏబీ–పీఎంజేఏవై రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో ఎంపానెల్ అయిన ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో 1,835 రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్సలు పొందవచ్చు.
- లబ్ధిదారులు నమోదు చేసుకున్న మొదటి రోజు నుంచి చికిత్సను యాక్సెస్ చేయడం ప్రారంభించవచ్చు. ఏదైనా వ్యాధి లేదా చికిత్స కోసం వేచి ఉండే కాలం ఉండదు, కాబట్టి కవరేజ్ వెంటనే ప్రారంభమవుతుంది.



అందరికీ వైద్యం అందేలా చూస్తాం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా అర్హులైన 70 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్లందరికీ వైద్యం అందేలా చర్యలు చేపడుతాం. ఆయుష్మాన్ భారత్ అమలు చేస్తున్న ఆసుపత్రులలో చేరితే ఈ పథకం వర్తిస్తుంది.

– విజయ్‌కుమార్, ఆరోగ్యశ్రీ డీఎం

జిల్లా	ఆయుష్మాన్ కార్డులు	70 ఏళ్లు పైబడిన వారు
కరీంనగర్	28,6,038	84, 506
జగిత్యాల	34,8,602	44,163
పెద్దపల్లి	19,7,440	55,517
సిరిసిల్ల	11,1,243	35,122

700 ఏళ్లుగా వెలుగుతున్న ‘నంద దీపం’

గంభీరావుపేట(సిరిసిల్ల): ఆలయ నిర్మాణ సమయంలో వెలిగించిన నంద(అఖండ) దీపం 700 ఏళ్లుగా వెలుగుతూనే ఉంది. ఈ దీపాన్ని దర్శించుకోవాలంటే గంభీరావుపేట మండల కేంద్రానికి రావాల్సిందే. స్థానిక శ్రీసీతారామస్వామి ఆలయాన్ని కాకతీయుల రాజు ప్రతాపరుద్రుడు 1314లో నిర్మించినట్లు గుడి గంటపై చెక్కిన అంకెల ద్వారా తెలుస్తోంది. ఇల్లు, బడి, గుడి నిర్మించేటప్పుడు దీపాన్ని వెలిగించడం సంప్రదాయం. ఈక్రమంలోనే ఆలయ నిర్మాణ సమయంలో వెలించిన అఖండ దీపాన్ని 700 ఏళ్లుగా ఆరిపోకుండా భక్తులు జాగ్రత్తలు పడుతున్నారు. రాజుల కాలంలో ప్రజలు చెల్లించే పన్నులో నుంచి కొంతభాగం దీపానికి నూనె సమకూర్చేవారు. తర్వాత కాలంలో దాతలు ముందుకొచ్చారు. ప్రస్తుతం గంభీరావుపేటకు చెందిన అయిత రాములు–ప్రమీల దంపతులు తమ జీవితకాలం నూనెను అందిస్తామని హామీ ఇచ్చి, అందజేస్తున్నారు. దీపానికి నెలకు దాదాపు 10 కిలోల నూనె అవసరం ఉంటుందని అర్చకులు తెలిపారు.



శ్రీసీతారామస్వాముల మూల విగ్రహాలు



ఆలయంలో వెలుగుతున్న నంద దీపం

మిల్లర్లు ధాన్యం దించుకోవాలి

- ప్రభుత్వ నిబంధనలు పాటించాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: మిల్లర్లు ధాన్యం దించుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో పౌరసరఫరాల అధికారులు, బాయిల్డ్, రా రైస్‌మిల్లర్లతో బుధవారం సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 152 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, అవసరం మేరకు మరిన్ని కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. మిల్లర్లు సహకరించాలని, వారు తీసుకొచ్చిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని మిల్లర్లు వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోవాలన్నారు. రైస్‌మిల్లర్లు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు ఇవ్వాలని, బ్యాంక్ గ్యారంటీ ఇవ్వలేమని తెలిపారు. టెస్ట్ మిల్లింగ్ చేసి బియ్యం రిటర్న్ పరిమాణం నిర్ధారించాలని, సీఎమ్మార్ బియ్యం అందించే గడువు పెంచాలని కోరారు. సన్నధాన్యం మిల్లింగ్ చేస్తే 67 కేజీల బియ్యం ఔటర్న్ రాదని, దాన్ని వాస్తవానికి అనుగుణంగా తగ్గించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్ చార్జీలు, డ్రైయేజీలు చెల్లించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా పౌరసరఫరాల అధికారి పి.వసంతలక్ష్మి, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ పి.రజిత, డీసీవో రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రవీంద్రాచారి, మెప్మా అధికారి రాజేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

క్లుప్తంగా

ఐదుగురు పోకిరీలపై కేసు

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఎదుట విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఐదుగురు పోకిరీలను షీటీమ్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బైక్‌లపై ర్యాష్‌గా వెళ్తూ విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని జిల్లా షీటీమ్‌కు సమాచారం అందింది. ఈమేరకు బుధవారం సాయంత్రం జిల్లా షీటీమ్ సిబ్బంది పాఠశాల వద్ద మఫ్టీలో ఉండగా బైక్‌పై ర్యాష్‌గా వెళ్తున్న వారిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. మహిళలు, యువతులు వేధింపులకు గురైతే జిల్లా షీటీమ్‌ను 87126 56425కు సమాచారం ఇవ్వాలన్నారు.

పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి



సిరిసిల్లటౌన్: పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకుంటేనే భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తవని జిల్లా బాలల పరిరక్షణ ఆఫీసర్ ముదం లక్ష్మణ్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని నెహ్రూనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం ఐసీడీఎస్ కార్యకర్తలకు చట్టబద్ధమైన దత్తతపై అవగాహన కల్పించారు. చట్టవిరుద్ధంగా దత్తత తీసుకుంటే మూడేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తారని తెలిపారు. పిల్లల క్రయవిక్రయాలు చేస్తే ఏడేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా ఉంటుందని హెచ్చరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ అజెండాకు కౌన్సిల్ పచ్చజెండా

- సిరిసిల్ల మున్సిపల్ సమావేశంలో తీర్మానం
- రూ.60లక్షల పనులకు గ్రీన్‌సిగ్నల్
- వివరాలు వెల్లడించిన చైర్‌పర్సన్ జిందం కళ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: ప్రజాసంక్షేమం, అభివృద్ధి పనులకు మున్సిపల్ అజెండాకు కౌన్సిల్ పచ్చజెండా ఊపింది. సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. రెండో బైపాస్‌రోడ్డులో వీధి దీపాలు లేక ప్రమాదాలు జరుగుతున్నందునా లైటింగ్ ఏర్పాటుకు నిధుల కేటాయింపు కోసం కలెక్టర్‌కు విన్నవించాలని, గతంలో డ్రాలో జాబితాలో పేర్లు వచ్చిన అర్హులకు, ఎస్సీలకు ఇవ్వాల్సిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై చర్చసాగింది. గతంలో చేపట్టిన రూ.41కోట్ల అభివృద్ధి పనులు నిలిచిపోగా.. ఆ నిధుల విడుదల కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలవాలని నిర్ణయించారు.

రూ.60లక్షలతో పనులు

సిరిసిల్లలో శానిటేషన్ నిర్వహణలో భాగంగా మ్యానువల్ స్వీపింగ్ మిషిన్లు, బ్లీచింగ్ కొనుగోలు, డంప్‌యార్డులో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.9లక్షలు కేటాయించారు. ప్రధాన డ్రెయినేజీల్లో సిల్టు తొలగించి మినీ ఎక్స్‌వేటర్ మిషన్ కొనుగోలుకు రూ.26లక్షలు, తాగునీటి సరఫరా, నిర్వహణలో వాటర్ సప్లయ్ మెటీరియల్, బ్లీ అండ్ పోస్ట్ క్లోరినేషన్ ప్లాంటు ఏర్పాటుకు రూ.13లక్షలు, సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి రూ.12లక్షలు మొత్తంగా రూ.60లక్షల పనులకు పరిపాలనపరమైన మంజూరు ఇవ్వడం జరిగిందని చైర్‌పర్సన్ జిందం కళ, మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య తెలిపారు. వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, మేనేజర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తుస్..తుస్

- ఇళ్ల మధ్యే టపాసుల దుకాణాలు
- గోదాములుగా నివాసగృహాలు
- ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోని అధికారులు



టపాసుల దుకాణం

ముస్తాబాద్(సిరిసిల్ల): దీపావళి.. అంటేనే టపాసుల మోత. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు టపాసులు కాల్చుతూ సరదాగా గడుపుతారు. అయితే ఆ ఆనందం వెనుక ప్రమాదం జరిగితే అంతులేని విషాదం వెంటాడుతుంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న భారీ నష్టం జరిగే అవకాశం ఉంటుంది. అయినా జిల్లా వ్యాపారులు మాత్రం నిబంధనలు పాటించడం లేదు. ఇళ్లలోనే బాంబులు(టపాసులు) నిల్వ చేయడంతోపాటు నివాసాల మధ్య గల్లీల్లోనే దుకాణాలు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

జిల్లాలో 112 దుకాణాలు

జిల్లాలో టపాసులు విక్రయించేందుకు 112 దుకాణాల కోసం దరఖాస్తులు వచ్చాయి. సిరిసిల్లలో 57, వేములవాడలో 42, ఎల్లారెడ్డిపేటలో 8, ముస్తాబాద్, గంభీరావుపేట, ఇల్లంతకుంటల్లో ఒక్క దుకాణం, తంగళ్లపల్లిలో 2 దుకాణాలకు దరఖాస్తులు వచ్చాయి. వీర్నపల్లిలో ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదు. కానీ మండలంలో టపాసుల వ్యాపారం మాత్రం జోరుగా సాగుతోంది. జనావాసాల మధ్య టపాసుల దుకాణాలు పెడుతుండడం ప్రమాదకరంగా మారింది.

నిబంధనలు బేఖాతర్

జిల్లాలో తాత్కాలిక లైసెన్స్ పొందుతున్న వారిలో చాలా మంది నిబంధనలు గాలికి వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. అటవీ ప్రాంతానికి ఆనుకున్న మండల కేంద్రాల్లో ఇళ్ల మధ్యే దుకాణాలు పెడుతున్నారు. గల్లీల్లోని ఖాళీ ఇళ్లల్లో టపాసులు నిల్వ చేస్తున్నారు. జిల్లాలోని మండల కేంద్రాల్లో పదుల సంఖ్యలో దుకాణాలు పెడుతున్నా పర్యవేక్షించే వారు లేక దరఖాస్తులు తక్కువగా చేసుకుంటున్నారు. జిల్లాలో పర్మినెంట్ టపాసుల దుకాణాలకు లైసెన్స్‌లు లేవు. అయినా నిత్యం సిరిసిల్ల పట్టణంతోపాటు ఆయా మండల కేంద్రాల్లో టపాసుల విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



బాణసంచా దుకాణాల నిర్వాహకులు పంచాయతీ, మున్సిపల్, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. ఫైర్ నిబంధనలు పాటించాలి. తాత్కాలిక లైసెన్స్‌లు మాత్రమే ఇస్తున్నాం. గోదాములు లేవు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం.

– నర్మెట నరేందర్, ఫైర్ ఆఫీసర్, సిరిసిల్ల

బ్యాంక్ గ్యారంటీ ఇవ్వలేం



కలెక్టరేట్ వద్ద రా రైస్ మిల్లర్లు

సిరిసిల్ల: వానాకాలం సీజన్ వడ్లను దింపుకునేందుకు బ్యాంకు గ్యారంటీ ఇవ్వలేమని జిల్లా రా రైస్ మిల్లర్లు స్పష్టం చేశారు. ఈమేరకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లకు బుధవారం రా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బ నాగరాజు, కార్యదర్శి రాజిరెడ్డి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చే ఆర్థిక స్థోమత లేదన్నారు. అప్పులు చేసి మిల్లులు పెట్టుకున్నామని, అయినా కష్టనష్టాలు భరించి సీఎమ్మార్‌లో పాలుపంచుకున్నట్లు తెలిపారు. ఆస్తులు కుదువపెట్టి బ్యాంక్ లోన్లు తీసుకుని తీర్చలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. నూక డ్యామేజీ శాతం ఎక్కువగా రావడంతో నష్టపోతున్నామన్నారు. సన్న ధాన్యం మిల్లింగ్ చేస్తే 67 కేజీల బియ్యం ఔటర్న్ రాదని, వాస్తవాలకు అనుగుణంగా తగ్గించాలని కోరారు. పెండింగ్ మిల్లింగ్ చార్జీలు చెల్లించాలని కోరారు. 2023–2024 సీఎమ్మార్ బకాయిలు కూడా అందిస్తామని స్పష్టం చేశారు. సంఘం కోశాధికారి చేపూరి శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు గరిపెల్లి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు వంశీధర్‌రావు, సభ్యులు సత్యంరావు, నగునూరి శ్రీకాంత్, ఉప్పల కృష్ణమూర్తి, పుల్లూరి శ్రీనివాస్, బందం వెంకన్న, చేపూరి అంజన్న, బండ సతీశ్ పాల్గొన్నారు.

2న కేజీబీవీ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న మహిళా అధ్యాపక పోస్టుల భర్తీకి గతేడాది జూలైలో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన మెరిట్ జాబితా ఆధారంగా ప్రస్తుతం ఖాళీలను భర్తీ చేయనున్నట్లు డీఈవో రమేశ్ తెలిపారు. గతంలో సాధించిన ఫలితాల ఆధారంగా ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ పోస్టులకు ఎంపికైన 1:3 అభ్యర్థుల జాబితా సిరిసిల్ల విద్యాధికారి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు నవంబర్ 2న డీఈవో కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. వివరాలకు హెల్ప్‌డెస్క్ 96429 59599, 94931 11179లలో సంప్రదించాలని కోరారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. తేమ శాతం తగ్గించేందుకు రైతులు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టగా.. హఠాత్తుగా కురిసిన వర్షంతో తడిసిపోయింది. ఇప్పటికైనా అధికారులు త్వరగా కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రాజన్నను దర్శించుకున్న అఘోరి



వేములవాడ రాజన్న సన్నిధిలో అఘోరి

వేములవాడ అర్బన్/కొండగట్టు: వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్నను బుధవారం అఘోరి దర్శించుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. సనాతన ధర్మంపై అవగాహన కల్పించడం కోసమే ఆలయాలు సందర్శిస్తున్నట్లు తెలిపారు. అయితే ఆమెను చూసేందుకు భక్తులు ఎగబడ్డారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి

- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి



సిరిసిల్లలో టపాసుల దుకాణాలు పరిశీలిస్తున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల: టపాసుల వ్యాపారులు నిబంధనలు పాటించాలని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని మానేరువాగు తీరంలో బతుకమ్మ ఘాట్ పక్కన ఏర్పాటు చేసిన టపాసుల షాపులను బుధవారం సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణతో కలిసి పరిశీలించారు. టపాసుల దుకాణాల వద్ద నీళ్ల డ్రమ్ములు, ఇసుక బకెట్లు ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాల మధ్య వాహనాలు నిలపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాలను బయటే నిలపాలన్నారు. అగ్ని ప్రమాదానికి కారణమయ్యే వస్తువులు దుకాణాల వద్ద ఉండొద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తాత్కాలిక లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



బీఆర్ఎస్‌తోనే తప్పిన విద్యుత్ భారం

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ భారం పడకుండా నిలువరించడంలో బీఆర్ఎస్ విజయం సాధించిందని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. సిరిసిల్లలో బుధవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. విద్యుత్ సమస్యలపై కేటీఆర్ ఇచ్చిన ప్రజంటేషన్‌తోనే ప్రజలపై భారం పడకుండా ఈఆర్సీ నిర్ణయం తీసుకుందన్నారు. పవర్‌లూమ్స్‌కు విద్యుత్ సబ్సిడీని 10 హెచ్‌పీల నుంచి 25 హెచ్‌పీలకు పెంచడం కూడా కేటీఆర్ చలువేనన్నారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతను అడ్డుకున్న అధికారులు



నరికివేసిన చెట్లను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రంలోని రైతులకు ధాన్యం ఆర బెట్టుకునేందుకు స్థలం లేకపోవడంతో బుధవారం స్థానిక శ్రీవేంకటేశ్వర ఆలయం ఆవరణలోని ఫారెస్టులో చెట్లను నరికివేసేందుకు గ్రామస్తులు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని చెట్ల నరికివేతను అడ్డుకున్నారు. ఎఫ్ఆర్‌వో ఖలీలొద్దీన్ మాట్లాడుతూ ఫారెస్టును నరికి చదును చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలం లేకపోతే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. మళ్లీ చెట్లను నరికివేసేందుకు ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డిప్యూటీ ఫారెస్టు రెంజ్ ఆఫీసర్ రాఘవేందర్‌రావు, సెక్షన్ ఆఫీసర్లు, ఫారెస్టు సిబ్బంది ఉన్నారు.

దొంగల ముఠా అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బస్టాండులో దొంగతనాలు చేస్తున్న అంతర్ రాష్ట్రముఠాలోని నలుగురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ బిల్లా కోటేశ్వర్ వివరాల ప్రకారం మహారాష్ట్రలోని జలగాం జిల్లా భూసవల్ గ్రామానికి చెందిన పసుపులేటి దుర్గ, పసుపులేటి రాం, పసుపులేటి రవి, పసుపులేటి రేణు చీరలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కరీంనగర్ బస్టాండుకు కారులో వచ్చారు. రద్దీగా ఉన్న ప్లాట్‌ఫాం వద్దకు వెళ్లి బస్సు ఎక్కుతున్న మహిళల బ్యాగు నుంచి బంగారం, నగలు దొంగిలించారు. కారులో మహారాష్ట్ర వెళ్లి దొంగలించిన సొమ్ము విక్రయించారు. బుధవారం నగరంలోని డీర్ పార్కు వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీ చేశారు. వారినుంచి రూ.36వేల నగదు, 23గ్రాముల బంగారం, ఎనిమిది సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేశారు.





తీయని వేడుక చేసుకుందాం..

సంతోషాల పండుగ దీపావళిని సంబురంగా నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు బుధవారం అన్ని వస్తువులు కొనుగోలు చేశారు. పూజకు అవసరమైన పూలు, పండ్లు, గుమ్మడికాయలు, కుటుంబ సభ్యుల నోరు తీపి చేసేందుకు స్వీట్లు కొన్నారు. దీపావళిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లోని పలు వ్యాపారులు జోరందుకున్నాయి. మిఠాయిల దుకాణంలో స్వీట్లు కొంటూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల